క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి



తెనాలిఅర్బన్: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలు పథక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ట్రిక్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, ఎంఈ.శ్రీకాంత్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయంలో ముగిసిన ఉత్సవాలు



తెనాలి: స్థానిక శివాజీచౌక్‌లోని కాళీమాత దేవస్థానంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. దేవస్థానం కమిటి చైర్మన్ గుమ్మడి రమేష్, యర్ర శ్రీనివాసరావు, అడపాల నాగేశ్వరరావు, కందేపి సీతారామయ్య, పాటిబండ్ల గోపి, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, నిమజ్జనం చేశారు.

8న తెనాలిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

తెనాలిఅర్బన్: కె.ఎస్.కె.విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కటైర డేవిడ్ యశ్వంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న ఐతానగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, అప్తామాలజీ, డెర్మాటాలజీ, పాల్మానాలజి, తదితర వైద్యులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

రేపు తెనాలిలో మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం

తెనాలిఅర్బన్: సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో, ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ వారి సహకారంతో తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసేందుకు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రముఖులు, వివిధ సంస్థల నిర్వాహకులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



కొల్లిపర: మండల పరిధిలోని దావులూరిపాలెంలో ఇటీవల విద్యుత్ ఘాతకం కారణంగా అగ్ని ప్రమాదం జరిగిన దేవరకొండ మంగమ్మ, నగ్మా కు చెందిన రెండు పోషణలు కలిగిన పూరి ఇల్లు అగ్నికి ఆహుతైంది. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలిపోవడంతో వైఎస్సార్‌సీపీ పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్ప రెడ్డి, నియోజకవర్గం బిసి నాయకులు మోర్ల శ్రీను బాధితులను కలసి పరామర్శించి రూ.10,000 నగదు, నిత్యావసర సామాన్లు అందజేశారు.

శివాలయం దేవస్థాన చైర్మన్ సాంబయ్య మృతి



తెనాలిటౌన్: రూరల్ మండలం ఖాజీపేట కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం (శివాలయం) ట్రస్ట్ బోర్డు చైర్మన్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు రాచర్ల సాంబయ్య (85) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో శివాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని గ్రామస్తులు పేర్కొన్నారు. వెనిగళ్ళ శ్రీకృష్ణప్రసాద్, పలువురు పెద్దలు సందర్శించి నివాళులర్పించారు.

కాంట్రాక్ట్‌కు దూరం... దూరం..

- తెనాలిలో టెండర్లకు దూరంగా ఉన్న కాంట్రాక్టర్లు
- 17 వర్కులకు కేవలం మూడింటికే టెండర్లు వేసిన వైనం
- గతనెల పిలిచిన 40 పనులు బహిష్కరణ
- ఇంజినీరింగ్ అధికారుల తీరే వల్లే టెండర్లలో పాల్గొనటం లేదని కాంట్రాక్టర్ల వెల్లడి
- నిలచిపోతున్న తెనాలి అభివృద్ధి



తెనాలి మున్సిపల్ కార్యాలయం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపాలిటీలో జరిగే టెండర్లను కాంట్రాక్టర్లు బహిష్కరిస్తున్నారు. పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎన్నిసార్లు టెండర్లు పిలుస్తున్న కాంట్రాక్టర్‌లు మాత్రం వాటి వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. చేసేది లేక ఇంజినీరింగ్ అధికారులు పదేపదే వాటికే టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో తెనాలి పట్టణ అభివృద్ధి పూర్తిగా నిలచిపోతుంది.

తెనాలి పట్టణం 16.77 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉంది. దీనిలో 55,917 నివాస గృహాలున్నాయి. 2.60 లక్షల జనాభాతో జిల్లాలోనే ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుగాంచింది. ప్రతి ఏడాది వివిధ పన్నులు, షాపు రూంల అద్దెలు వంటి వాటి ద్వారా రూ.36 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇవికాకుండా 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్‌ల ద్వారా సుమారు రూ.50 కోట్ల వరకు సమకూరుతుంటాయి.

ఏడాదికి సగటున 190 పనులకు టెండర్లు

జిల్లాలో ఏకైక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న తెనాలి పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఏడాదికి సగటున 190 అభివృద్ధి పనులకు ఇంజినీరింగ్ అధికారులు ఆన్‌లైన్‌లో టెండర్లు పిలుస్తుంటారు. వాటిలో పాల్గొన్న వారి వివరాలు అజెండాలో పొందుపరచి మున్సిపల్ కౌన్సిల్ అనుమతి తీసుకుని వర్క్ ఆర్డర్లు ఇస్తుంటారు. అనంతరం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఏడుగురే యాక్టివ్!

తెనాలి మున్సిపాలిటీ పరిధిలో 52 మంది కాంట్రాక్టర్లు ఉన్నారు. వీరిలో కొందరు వివిధ ప్రభుత్వ శాఖలలో జరిగే టెండర్లలో ఎక్కువగా పాల్గొంటూ మున్సిపల్ టెండర్లకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం 20 మందికి పైగా మున్సిపాలిటీలో యాక్టివ్ కాంట్రాక్టర్లుగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేవలం ఏడుగురు మాత్రమే టెండర్లలో పాల్గొంటున్నారు. మిగిలిన వారు స్తబ్ధతతో ఉంటున్నారు.

నిలచిన బిల్లుల చెల్లింపులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధి యాప్‌ను నూతనంగా ప్రవేశపెట్టింది. కాంట్రాక్టర్‌లు చేసిన ప్రతిపనికి సంబంధించిన వివరాలు యాప్‌లో పొందుపరచి ఏఈ, డీఈ, ఎంఈ, కమిషనర్‌లు థంబ్ (వేలిముద్ర) వేసి అనుమతి తెలపాల్సి ఉంటుంది. అయితే కొద్దిరోజుల క్రితం వరకు యాప్ సరిగా పనిచేయకపోవటంతో ఏడాది నుంచి బిల్లుల చెల్లింపులు పూర్తిగా నిలచిపోయాయి. చేసేదిలేక కాంట్రాక్టర్‌లు నూతన పనులకు టెండర్లు దాఖలు చేయకపోగా గతంలో దక్కించుకున్న పనులను ప్రారంభించకుండా తాత్సారం చేస్తున్నారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నిస్తే తమకు బిల్లులు రావటం లేదని, అవి వచ్చినప్పుడు మిగిలిన పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్‌లు చెబుతున్నారు. చేసేదిలేక కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాలలో ఇంజినీరింగ్ అధికారులను నిలదీస్తు వస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల నూతనంగా మున్సిపల్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి శ్రీకాంత్‌పై కూడా కాంట్రాక్టర్లు పలు ఆరోపణలు చేస్తున్నారు. తెనాలిలో ఎన్నడు లేని నిబంధనలు పెడుతున్నారని, ఆయన హయాంలో తాము పనులు చేయలేమని, అలా చేస్తే తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు దీనిపై దృష్టి సారించి ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టెండర్లకు దూరంగా..

గతంలో తెనాలి మున్సిపాలిటీలో జరిగే టెండర్లలో పోటీ ఎక్కువగా ఉంటుండేది. ఒక్కోసారి టెండర్లు దక్కవనే భయంతో ప్రజాప్రతినిధులతో సిఫార్స్ చేయించుకుని మరీ వాటిని దక్కించుకున్న సందర్భాలు ఉండేవి. కానీ కొద్ది సంవత్సరాల నుంచి పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారైంది. గత నెల జరిగిన రూ.3.6 కోట్ల పనులకు సంబంధించిన 40 టెండర్లలో ఒక్క కాంట్రాక్టర్ కూడా పాల్గొనలేదు. బుధవారం రూ.70 లక్షల పనులకు పిలచిన 17 టెండర్లలో కేవలం మూడు పనులకు కాంట్రాక్టర్‌లు టెండర్లు వేశారు. మిగిలిన 14 పనులకు ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. అలాగే ఈనెల 3వ తేదీన 1.20 కోట్లకు సంబంధించిన 16 పనులు, 8వ తేదీన రూ.1.20 కోట్లకు సంబంధించిన 11 పనులకు టెండర్లు ఓపెన్ చేయనున్నారు. వాటిలో కాంట్రాక్టర్‌లు పాల్గొంటారా లేదా అనే సందిగ్ధత కొనసాగుతోంది.

బిల్లులు చెల్లిస్తున్నాం



తెనాలి మున్సిపాలిటీలో జరిగే టెండర్లలో కాంట్రాక్టర్లు ఎక్కువగా పాల్గొనని మాట వాస్తవం. నిధుల చెల్లింపుల జాప్యం ఒక కారణమైతే ఇసుక అందుబాటులో లేకపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు నాలుగు రోజుల నుంచి ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి ఒక్కో వార్డులో కనీసం ఒక పని అయినా ప్రారంభించేలా చూడాలని ఆదేశించనున్నాను. ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పడిన సమస్యలు త్వరలో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

–పినప శ్రీకాంత్, మున్సిపల్ ఇంజినీర్, తెనాలి.

కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. కార్మికుల దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం మాత్రమే వారు అడుగుతున్నారని, ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, గురవయ్య, ఆశీర్వాదం, కార్మికులు పిచ్చయ్య, నాగేశ్వరరావు, సాంబశివరావు, ఇశ్రాయిల్, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి, సారమ్మ, ఇమాంబి, కాసమ్మ, రిబ్కా, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

12న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న జాతీయస్థాయిలో ఉపాధ్యాయ రత్న, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యా, విజ్ఞాన బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో అత్యుత్తమ శిక్షణ ద్వారా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల ప్రతిభ, సేవా నిరతిని వెలుగులోకి తెచ్చి, వారిని మరింతగా ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలిపారు.

రాజధానిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో మూలనపడిన వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

తాడికొండ: రాజధానిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన శనివారం తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. క్రైమ్ రేటు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిథిలావస్థకు చేరిన పోలీస్ క్వార్టర్స్‌ను తనిఖీ చేశారు. నూతన భవనం లేదా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే దానిపై సిబ్బందిని ఆరా తీశారు. తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో మూలనపడిన వాహనాలను పరిశీలించారు. రాజధాని నేపథ్యంలో ఇక్కడ పరిస్థితులు, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాక తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు రావడం ఇదే మొదటిసారని తెలిపారు. జిల్లాలో తుళ్లూరు పోలీస్ స్టేషన్ చాలా ముఖ్యమైనదని, సెక్రటరియట్, హైకోర్టు ఈ పరిధిలోనే ఉండటంతో అప్రమత్తంగా ఉంటున్నట్లు చెప్పారు. లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చర్యలు తీసుకున్నామని, తుళ్లూరులోని కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కూడా పెట్టించినట్లు తెలిపారు. మరికొన్నింటిని సీఆర్డీయే ద్వారా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

త్వరలో సిబ్బంది నియామకం

తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో 50 శాతం సిబ్బంది కొరత ఉందని త్వరలోనే భర్తీ చేస్తామని ఎస్పీ తెలిపారు. రాజధానిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో నిత్యం నేరాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అనేక కంపెనీలు పనులు చేస్తూ ఉన్నాయని, వాటికి ఆటంకం కలుగకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించినట్లు వివరించారు. ఈ ప్రాంతంలో డ్రోన్‌లతో నిఘా పటిష్టం చేస్తామని వెల్లడించారు. ప్రతి రోజూ సీఎం, హైకోర్టు జడ్జీలు, అధికారులు, సామాన్య ప్రజలు ప్రయాణిస్తుంటారని, ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తాడికొండ సీఐ కె.వాసు, సీఐలు కె. శ్రీనివాసరావు, అంజయ్య, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాపుల సమస్యల పరిష్కారానికి కృషి



జనార్థన్ సన్మానిస్తున్న శివశంకర్

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వ విజయానికి కృషి చేసిన కాపులకు సమస్యలు సృష్టించడం మంచి పద్ధతి కాదని కాపు జేఏసీ వ్యవస్థాపకులు చందు జనార్థన్ పేర్కొన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో సోమవారం బోసురోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల హక్కుల సాధన కోసం ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు మెమోరండాలు అందజేయడం జరిగిందన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి ఉన్న రిజర్వేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాపుల ఆకాంక్షలు నేరవేర్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. శివశంకర్ మాట్లాడుతూ కాపు జేఏసీని ఏర్పాటు చేసి హక్కుల సాధన కోసం నిరంతరం జనార్దన్ పోరాటం చేస్తున్నాయని కొనియాడారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శెట్టిపల్లి సుబ్రమణ్యం, పేటేటి రవికుమార్, కమ్మెల రజిని, కమ్మెల శ్రీనివాసరావు, పెద్దిశెట్టి హనుమంతరావు, తవిటి భాస్కరరావు, నాగం రాంజీ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ అప్పలనాయుడు



హాజరైన సచివాలయ ఉద్యోగులు

మున్సిపల్ కమిషనర్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఇంటి, నీటి, కుళాయి, ఖాళీ స్థల పన్నులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు ఆదేశించారు. రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు తెనాలి పట్టణంలో జరిగిన పన్నుల చెల్లింపులపై ఆరా తీశారు. కొత్త అసెస్మెంట్‌లకు త్వరగా పన్నులు విధించాలని సూచించారు. అలాగే అసెస్మెంట్‌ల సర్వేను త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, ఆర్‌ఐలు కోటేశ్వరరావు, రాజేష్ కన్నా పాల్గొన్నారు.

వయసు మళ్లిన వారికి ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల ఉచిత వైద్యశిబిరంలో వీవీ జగదీష్‌కుమార్



వైద్యశిబిరంలో పరీక్షలు

తెనాలి: ఆరోగ్యానికి మించిన సంపద లేదని, ప్రతి వారూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని భారతీయ స్టేట్‌బ్యాంక్ తెనాలి రీజినల్ మేనేజర్ జగదీష్ కుమార్ అన్నారు. ముఖ్యంగా వృద్ధులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారతీయ స్టేట్‌బ్యాంక్ దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కొత్తపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ విశ్రాంత సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రీజినల్ మేనేజర్ జగదీష్‌కుమార్ ప్రారంభించారు. బ్యాంకు ఆదేశాలపై తెనాలితోపాటు రీజినల్ పరిధిలోని పొన్నూరు, బాపట్లలోనూ వైద్యశిబిరాలను నిర్వహించినట్లు చెప్పారు. రమేష్ హాస్పిటల్స్ సహకారంతో డాక్టర్ మహిధర్ పర్యవేక్షణలో 70 మందికి పైగా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. డాక్టర్ మహిధర్ మాట్లాడుతూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. బ్యాంక్ ప్రధానశాఖ అధిపతి వాసుదేవరావు, ముఖ్య కార్య నిర్వహణాధికారి తిరుమలరావు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది మణికంత, బ్యాంక్ మార్కెటింగ్ కన్సల్టెంట్ సాయి లక్కరాజు పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్ల సేవ'లో పుస్తకావిష్కరణ



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు, పలు రాజకీయ పార్టీల నాయకులు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎదుట ఉన్న రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు కళావేదికలో శనివారం ఆటో డ్రైవర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీనాయకులు, ఎంటీఎంసీ అధికారులు హాజరయ్యారు. కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సేవ పథకంలో లేనివారు సంబంధిత అధికారులను సంప్రదించి చేరే అవకాశముందని పేర్కొన్నారు. అనంతరం 2,291 ఆటో డ్రైవర్లకు గానూ 3,43,65,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, టీడీపీ, బీజేపీ నాయకులు, ఎంటీఎంసీ అధికారులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ, సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి



మాట్లాడుతున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలందరికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, వాణిజ్యశాఖ డిప్యూటీ కమిషనర్ ముత్యాలరావు పాల్గొని ప్రభుత్వం ఇటీవల వస్తు సేవలపై తగ్గించిన జీఎస్టీ వివరాలను వెల్లడించారు. వ్యవసాయ, కుటీర చిన్నతరహా పరిశ్రమాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సభల్లో జీఎస్టీపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అక్టోబర్ 19వ తేదీ వరకు జీఎస్టీ తగ్గింపు ప్రజలకు వివరించాలని సూచించారు. దాదాపు 800 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గిందని, గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ కొన్ని వస్తువులపై 5శాతం తగ్గిందని, ప్రజలు గమనించాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తయారుచేసిన వస్తువులను విక్రయించేందుకు 6వతేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన, అమ్మకం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జీఎస్టీ అధికారులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలను భారతీయులంతా వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను భారత పౌరులందరూ వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. ఉండవల్లి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం కుంభ ఆంజనేయులు అధ్యక్షతన పార్టీ రాజధాని డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ అదనపు సుంకాలు పెంచి భారత్‌ను అదుపు, ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరైనది కాదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాన్నుంచి బయట పడేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలపై అదనపు సుంకాలు విధిస్తోందని వివరించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. పేదలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నేతలు భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు, చెంచయ్య, రామకృష్ణ, జానీ, పార్వతి, షేక్ ఖాదర్ బాబా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కొల్లిపర: మండల పరిధిలోని దావులూరిపాలెంలో ఇటీవల విద్యుత్ ఘాతకం కారణంగా అగ్ని ప్రమాదం జరిగిన దేవరకొండ మంగమ్మ, నగ్మా కు చెందిన రెండు పోషణలు కలిగిన పూరి ఇల్లు అగ్నికి ఆహుతి అయింది. దీంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలిపోవడంతో వైఎస్సార్ సీపీ పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్ప రెడ్డి, నియోజకవర్గం బిసి నాయకులు మోర్ల శ్రీను బాధితులను కలసి పరామర్శించి రూ.10,000 నగదు,నిత్యావసర సామాన్లు అందజేశారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ఫిరంగిపురం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శివరామకృష్ణ తెలిపారు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో శనివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు పరిశీలించారు. నిబంధనలు పాటించకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. ప్రతీ ద్విచక్ర వాహనదారుడు ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే అవుతుందని హెచ్చరించారు. తనిఖీలలో ఏఎస్ఐ పి.జాన్‌ఖాన్, రైటర్ దాసు పాల్గొన్నారు.